
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.156 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 72.156 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 2447 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,540
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,100
3శాతం జీఎస్టీతో	రూ.7,313
నవర (8గ్రా)	రూ.58,504

గరిష్టం/కనిష్టం
31.2 /24.9

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 70 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రూ.3 వేలు తత్కాల్ ఫీజుతో చివరి అవకాశం

నెల్లూరు (టౌన్): ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి తత్కాల్ పథకం కింద పరీక్ష ఫీజు రూ.3 వేలు చెల్లించేందుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ఆర్‌ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులందరికి ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ తెలియజేయాలన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీగా వెంకటసుబ్బయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటసుబ్బయ్య

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్ష ఏపీసీగా వెంకటసుబ్బయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్షలో పని చేస్తున్న పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ఎన్‌ఎంఎంఎస్ ప్రాథమిక కీ

నెల్లూరు (టౌన్): జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ప్రాథమిక పరీక్షకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలను సంబంధిత పాఠ్యాంశ నిపుణులతో సవరించి తుది కీ www. bse. ap. gov. in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుది కీపై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబడవన్నారు.

రూ.4.49 లక్షల ఎరువుల సీజ్



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ ప్రతాప్

కలువాయి: కలువాయి ఆగ్రో విక్రయ సేవా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న రూ.4.49 లక్షల విలువైన ఎరువులను సోమవారం సీజ్ చేసినట్లు ఏఓ ప్రతాప్ తెలిపారు. ఐపీఎల్ యూరియా 650 బస్తాలు, ఐపీఎల్ పొటాష్ 180 బస్తాలు సదరు ఎరువుల లైసెన్సులో ఓ-ఫాం ఇంక్లూజన్ లేకుండా, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా విక్రయిస్తున్నారని సాధారణ తనిఖీల్లో వెల్లడైనట్లు తెలిపారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, యూరియా కృత్రిమ కొరతను సృష్టించినా, ఇతర కాంప్లెక్సు ఎరువులతో యూరియాను లింక్ చేసి అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ పర్యటన

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ మంగళవారం నెల్లూరులో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా మైనార్టీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం నగరంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు రోడ్డు మార్గంలో ఒంగోలుకు వెళ్తారు.

పోలీసుల అదుపులో వైఎస్సార్‌సీపీ నేత



పోలీసు స్టేషన్‌కు చేరుకున్న కాకాణి, పర్వతరెడ్డి


నెల్లూరు సిటీ: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు మందల వెంకటశేషయ్యను పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భర్త చనిపోయిన తనను నమ్మించి మోసం చేశాడని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

కృష్ణాస్త్రం.. సక్సెస్

- ఫలించని రాయ'బేరం'..
- నెగ్గిన ప్రజాప్రతినిధి పంతం

- డిప్యుటేషన్‌పై కావలి సబ్‌రిజిస్ట్రార్ నెల్లూరుకు బదిలీ
- కావలికి స్టోన్‌హౌస్‌పేట రిజిస్ట్రార్ నియామకం
- మ్యూచువల్ డిప్యుటేషన్ ఉత్తర్వుల జారీ
- నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు
- గుంటూరుకు చెందిన ఓ ఉన్నతాధికారి లాబీయింగ్

రిజిస్ట్రేషన్ శాఖలో కృష్ణ లీలలు అన్నీ ఇన్నీ కావయ్యా. రెగ్యులర్ బదిలీలపై నిషేధం ఉన్నప్పటికీ కృష్ణాస్త్రం సంధించడంతో 'మ్యూచువల్ డిప్యుటేషన్' బదిలీలు జరిగాయి. ప్రభుత్వ శాఖల్లో ఇటువంటి బదిలీలు కూడా చేయొచ్చని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కొత్త భాష్యాన్ని పరిచయం చేసింది. ఓ ప్రజాప్రతినిధి తన అనుమతి లేకుండా బదిలీపై వచ్చిన సబ్ రిజిస్ట్రార్‌ను ఆ సీట్లో నుంచి వెళ్లగొట్టి.. తను మెచ్చిన మరో అధికారిని కూర్చోబెట్టడం వరకు జరిగిన పరిణామాలు భ్రష్ట చరిత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



సాక్షి, టాస్క్‌ఫోర్స్: కావలి సబ్ రిజిస్ట్రార్ సీటుపై సంధించిన కృష్ణాస్త్రం గురి తప్పలేదు. స్థానిక ప్రజాప్రతినిధి పంతం నెగ్గింది. ఆ సీట్లోకి మరొకరు వచ్చేందుకు ఉత్తర్వులు ఇచ్చారు. దాదాపు ఇరవై రోజులుగా నడుస్తున్న కావలి సబ్ రిజిస్ట్రార్ పోస్టు వ్యవహారంలో ప్రజాప్రతినిధిదే పైచేయిగా నిలిచింది. ఈ వ్యవహారంలో ఉన్నత స్థాయిలో లాబీయింగ్ జరిగి భారీగానే చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. రెండు నెలల క్రితం ప్రభుత్వ శాఖల్లో సాధారణ బదిలీలు జరిగాయి. అందులో భాగంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలోని ఓ మహిళా సబ్ రిజిస్ట్రార్ ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని, స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సులు, ఆశీస్సులతో పనిలేకుండానే కావలిలోని ఆ సీటులో కూర్చున్నారు. రెండు నెలల పాటు ఎడాపెడా కాసులు పిండేశారు. ఈ క్రమంలో అధికార పార్టీ రియల్టర్లకు కంటగింపుగా మారిన ఆ సబ్ రిజిస్ట్రార్ వ్యవహారం ప్రజాప్రతినిధి దృష్టికి వెళ్లింది. ఆ పోస్టుపై కన్నేసిన ఆ ప్రజాప్రతినిధి సదరు అధికారిణి దందాపై ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో ఆమె దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం చకచకా జరిగిపోయాయి.

నలుగురు పోటీ పడి..

కావలి సబ్‌రిజిస్ట్రార్ సెలవుపై వెళ్లడంతో ఆ పోస్టుకు డిమాండ్ పెరిగింది. నెలకు రూ.లక్షల్లో ఆదాయం వచ్చే ఆ పోస్టుకు నలుగురు పోటీ పడ్డారు. ప్రస్తుతం బదిలీలు బ్యాన్ కావడంతో డిప్యుటేషన్‌పై వచ్చేందుకు అధికారులు భారీ ఆఫర్లతో పోస్టింగ్ కోసం ఎగబడ్డారు. ఈ విషయం ఆ శాఖలో చర్చనీయాంశం కావడంతో ఎక్కడ తన పోస్టుకు ఎసరు పెడతారోనని, సదరు మహిళా సబ్ రిజిస్ట్రార్ సెలవులు రద్దు చేసుకుని హడావుడిగా విధుల్లో జాయిన్ అయ్యారు. ఆ తర్వాత స్థానిక ప్రజాప్రతినిధి వద్దకు రాయ'బేరం' పంపినా ఫలితం లేకుండా పోయింది. సదరు ప్రజాప్రతినిధిని కాదని ఇక్కడ విధుల్లో కొనసాగడం అంటే.. కత్తిమీద సాము చేయడమే అని భావించిన సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో దళారీ వ్యవస్థకు, అవినీతికి తావులేదంటూ ఆగమేఘాల మీద ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. పులి తాను శాఖాహారిగా మారానంటే ఎవరైనా నమ్ముతారా?. నోట్ల కట్టలు లేనిదే.. దస్తావేజులు కదలని రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి రహిత సేవలు అందిస్తామంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పెద్ద దుమారమే రేపింది.

పంతం పట్టిన ప్రజాప్రతినిధి

తనకు నచ్చని సబ్ రిజిస్ట్రార్ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆ ప్రజాప్రతినిధి సీఎంఓ కార్యాలయం స్థాయిలో ఒత్తిడి పెట్టారు. ఇదే అవకాశంగా ఉన్నత స్థాయిలోని అధికార యంత్రాంగం భారీగానే బేరం పెట్టారు. గుంటూరుకు చెందిన రిజిస్ట్రేషన్ శాఖాధికారి బేరం కుదర్చడంలో కీలక పాత్ర పోషించారు. స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్‌ను ఆ సీట్లో కూర్చోబెట్టేందుకు పావులు కదిపి సక్సెస్ చేశారు. ఈ వ్యవహారంలో ఆ శాఖలోని ఉన్నతాధికారుల నుంచి ప్రజాప్రతినిధి వరకు భారీ మొత్తంలోనే చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

సాధారణంగా ఏ సబ్ రిజిస్ట్రార్‌పైన అయినా ఆరోపణలు వచ్చినప్పుడు లూప్‌లైన్‌లోకి పంపడం సహజం. కానీ కావలి రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏ గ్రేడ్‌లో ఉంది. అక్కడ పనిచేసే అధికారిపై ఆరోపణలు వచ్చినప్పుడు బీ సెంటర్‌కు పంపాల్సి ఉంటుంది. జిల్లాలో కోవూరు, ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఆరోపణలున్న అధికారులను ఆయా ఖాళీ పోస్టులోకి పంపాల్సి ఉన్నా.. ఆ శాఖ ఉన్నతాధికారులు మాత్రం ఏ సెంటర్‌గా ఉన్న స్టోన్‌హౌస్‌పేటకు పంపడం వెనుక భారీ స్థాయిలో యంత్రాంగం మంత్రాంగం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

మ్యూచువల్ డిప్యుటేషన్.. కొత్త భాష్యం

ప్రభుత్వ శాఖల్లో సాధారణంగా మ్యూచువల్ బదిలీలు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో డిప్యుటేషన్లు ఉంటాయి. ఇవి కూడా సాధారణ బదిలీల్లోనే జరుగుతాయి. కానీ సాధారణ బదిలీలపై నిషేధం ఉన్నప్పుడు.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ బదిలీలకు 'మ్యూచువల్ డిప్యుటేషన్'తో కొత్త భాష్యం చెప్పింది. రాజు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కొదవా అన్నట్లు రిజిస్ట్రేషన్ శాఖాధికారులు తలుచుకుంటే.. ఏదైనా సాధ్యమే అని నిరూపించారు. డిప్యుటేషన్లు కూడా మ్యూచ్‌వల్‌గా చేయడం ఈ శాఖకే సాధ్యమైంది.



నెల్లూరులోనూ ఫ్లెక్సీ పెడతారా మేడమ్!

కావలి సబ్ రిజిస్ట్రార్‌గా విధుల్లో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధి ఆగ్రహానికి గురై తన ఉద్యోగానికి ఎక్కడ ముప్పు తలపెడతారో అని భయంతో కార్యాలయంలో అవినీతి రహిత సేవలు అందిస్తానంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అక్కడే కొనసాగితే ఏసీబీ అస్త్రం ప్రయోగించే అవకాశాలు ఉన్నాయని, అదే జరిగితే నడిరోడ్డు మీద నిలబడే పరిస్థితి వస్తుందని భయపడి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని ఆ శాఖలో చర్చ జరుగుతోంది. ఎట్టకేలకు ప్రజాప్రతినిధి సంధించిన అస్త్రం ఫలించి డిప్యుటేషన్‌పై నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అయితే ఇక్కడ కూడా కావలి తరహాలో 'అవినీతి రహిత సేవలు' పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తారా?.. తూచ్ అంటారా? అనే సందేహం అందరిలోనూ మెదులుతోంది. అవినీతికి కేరాఫ్‌గా మారిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్రయ విక్రయదారుల్లో అవగాహన కల్పించి అవినీతికి చోటు లేకుండా అలాంటి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే ఆమె నిజాయితీని మెచ్చుకోవాల్సిందే. లేదంటే ఆమె నిజాయితీని శంకించాల్సిందే.

27న వాలీబాల్ క్రీడా జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీనియర్ మహిళ, పురుషుల వాలీబాల్ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 27న విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, డీఎస్ఏ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఆర్కే యతిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికై న క్రీడాకారులు ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీ ఆఫ్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనవరి 7వ తేదీ నుంచి జైపూర్‌లో జరిగే జాతీయ మహిళ, పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. నేరుగా జరిగే ఈ ఎంపికల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు ఆధార్ కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, 10 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 27వ తేదీ ఉదయం 7 గంటలకు విజయవాడలోని వాలీబాల్ క్రీడా ప్రాంగణంలో హాజరు కావాలని తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ సోమవారం ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. సమావేశాలకు ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

పశుగ్రాసం.. ధరాభారం

- నిల్వ చేసుకున్న గడ్డి వానార్పణం
- మేతకు పాడి రైతుల కష్టాలు
- పచ్చిగ్రాసం దొరకాలన్నా.. నెల తర్వాతే..

ఎకరం ఎండు గడ్డి రూ.10 వేలు



ఎండు గడ్డి మేస్తున్న గేదెలు

జిల్లాలో పశువుల పెంపకం పాడి రైతులకు ఆర్థిక భారంగా మారుతోంది. పశువులకు మేతగా వినియోగించే ఎండుగడ్డి ధరలు ఆకాశాన్ని అంటాయి. ప్రధానంగా వరి కోతలు యంత్రాలతో చేపట్టుతుండడంతో గడ్డి కొరత ఏర్పడింది. పోషణలో ఉన్న పశువులకు తగినంత ఎండుగడ్డి మేత కరవవుతోంది. సీజన్‌లోనే అష్టకష్టాలు పడి యంత్రాలతో కోసిన గడ్డిని సేకరించి నిల్వ చేసుకున్నప్పటికీ ఈ ఏడాది గత రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తడిసిపోవడంతో పశువులకు మేత లేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులు మేయడానికి ఉండే పచ్చిక బయళ్లు ఇప్పుడు వ్యవసాయ భూములుగా మారాయి. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కావడంతో పచ్చి గడ్డి రావాలన్నా.. మరో నెల ఆగాల్సిన పరిస్థితి ఉంది.



ఈ ఫొటోలో కనిపించేది ఎండు గడ్డి వాము. గడ్డి కొరత ఏర్పడడంతో ఉన్న గడ్డి వర్షాలకు తడిసి పాడైపోయింది. దీంతో పాడి రైతులు గడ్డిని ఇప్పుడు బంగారం కన్నా గొప్పగా భావిస్తున్నారు. అల్లూరు మండలం సింగపేటలో పాడి రైతు ఒకరు ఎండు గడ్డిని ప్లాస్టిక్ పట్టలతో పూర్తిగా కప్పేశారు. కనీసం గడ్డి పూచ కూడా కనిపించకుండా గడ్డి వామును భద్ర పరచుకున్నాడు.

కావలి: జిల్లాలో తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్‌లో వరి సాగు గణనీయంగా తగ్గింది. ఎండు గడ్డి కొరత ఏర్పడింది. రైతుల పోషణలో ఉన్న పాడి పశువులకు తగినంత స్థాయిలో ఎండు గ్రాసం లభ్యత లేక ధరలు మండి పడుతున్నాయి. ఒక గేదె/ఆవుకు ఏడాది పొడవునా 2.5 ఎకరాల్లో వరి కోత కోసిన ఎండు గడ్డి అవసరం. ఈ లెక్కన జిల్లాలో ఉన్న పశువులకు 17,59,705 ఎకరాల్లో లభించే ఎండు గడ్డి అవసరమవుతోంది. వాస్తవానికి జిల్లాలో రబీ సీజన్‌లో 5.5 లక్షల ఎకరాలు, ఖరీఫ్‌లో 2.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. వరి కోతలు యంత్రాలతో చేపట్టుతుండడంతో కొంత వృథాగా పోతోంది. సగటున 7 లక్షల ఎకరాల్లో లభ్యత అయ్యే గడ్డిని మాత్రమే రైతులు సమీకరించుకుని కొనుగోలు చేస్తున్నారు. మిగతా గడ్డిని పక్క జిల్లాల నుంచి కొంత.. పచ్చిగడ్డి కొంత సమకూర్చుకుంటున్నారు. అయితే ఈ ఏడాది జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో రబీలో 5 లక్షల ఎకరాలకంటే తక్కువగా, ఖరీఫ్‌లో అయితే కేవలం 40 వేల ఎకరాల్లోనే వరి సాగు చేశారు. దీంతో ఎండు గ్రాసం కొరత ఏర్పడింది. ఈ ప్రభావం పాడి రైతులకు ఆర్థిక భారంగా మారింది. ఎండు గడ్డి అందుబాటులో లేక గేదెలకు, ఆవులకు మేత సమస్య జటిలంగా తయారైంది.



ఎండు గడ్డి వృథా కాకుండా భద్రంగా వినియోగం

భారీ వర్షాలు ముంచేశాయి


అసలు ఎండుగడ్డి కొరత ఉంటే.. వర్షాలతో ఉన్న అరకొర నిల్వలు సైతం పనికిరానిక చెత్తగా మారాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా ఎండు గడ్డి నిల్వలు తడిసి పాచి పట్టి పోయాయి. కుప్పల నూర్పిడి గడ్డి అయితే కొంత మేరకు ఉపయోగపడేది. కానీ వరికోత యంత్రాలతో కోసి గడ్డి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా గడ్డి ధరలు అమాంతం పెరిగాయి. ధర ఎంతైనా కొనుగోలు చేయాలన్నా.. గడ్డి దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర ఎంత పెట్టినా దొరకడం లేదు

రైతులు అధిక ధర చెల్లించి ఎండు గడ్డి కొనుగోలు చేసుకుంటున్నారు. గతేడాది ఎకరా ఎండు గడ్డి ధర రూ.2,000 ఉంటే ఈ ఏడాది రూ.4,000 పలికింది. గతేడాది ట్రాక్టరు ఎండు గడ్డి రూ.6,000 పలికితే, ప్రస్తుతం రూ.10 వేలు పెట్టినా దొరడం లేదు. ఒకప్పుడు హార్వెస్టర్లతో కోసిన గడ్డి పశువులు తినడానికి పనికిరాదన్న వారే, ఇప్పుడు ఆ గడ్డిని కొనుక్కుపోతున్నారు. పొలాల్లో పంట పండించిన రైతు దగ్గర రేటు ఎక్కువనుకుంటే రిటైల్‌గా వరి గడ్డి అమ్మే వ్యాపారులు మరింత పెంచేశారు. రూ.70 చొప్పున కట్ట ఎండు గడ్డి ధర ఉండగా, ఇప్పుడు రూ.130 ధరతో మండిపోతోంది. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి లారీల్లో గడ్డి తెచ్చి అమ్ముతున్నారు. మూడు నాలుగు గేదెలున్న పాడి రైతులు గడ్డి కొరత మరింత ఇబ్బందిగా మారింది. పాలు అమ్ముకునే పాడి రైతులు పెరిగిన గడ్డి ధర ప్రకారం పాల రేటు పెంచలేక, రెట్టింపైన వరి గడ్డిని కొనలేక ఇబ్బంది పడుతున్నారు.



పశువులకు ఎండు గడ్డి వేసే పనిలో ఉన్న పాడి రైతు



పచ్చిగడ్డి కోసం నెల ఆగాల్సిందే..

పశువుల మేత క్షేత్రాలు ఉండే బీళ్లు పొలాలుగా మారాయి. ప్రస్తుతం రబీ సీజన్ వ్యవసాయం ప్రారంభమైంది. గెనాల గడ్డి దొరకాలన్నా.. మరో నెల ఆగితే కానీ రాదని రైతులు వాపోతున్నారు. పశువులను పస్తులు పెట్టలేక.. రైతులు గడ్డి కోసం అష్టకష్టాలు పడుతున్నారు.

సీజన్‌లో కూడా ఎండు గడ్డి దొరకడం లేదు



నాకు నాలుగు బర్రెలు ఉన్నాయి. ఎకరాకు రూ.4,000 పెట్టి ఎండు గడ్డి కొన్నాను. సీజన్‌లో కూడా ఎండు గడ్డి దొరకలేదు. చిక్కిన కాడికి తెచ్చుకున్నాను. మరో నెలకు గడ్డి అయిపోతుంది. పచ్చిగడ్డి కూడా దొరుకుతుంటే.. అదీ, ఇదీ కలిపి పెట్టేవాళ్లం. ప్రస్తుతం అది కూడా దొరకడం లేదు.

– రామారావు, పాడి రైతు, సర్వాయపాళెం, కావలి మండలం

ఉత్తరాది నుంచి తెచ్చుకునే పరిస్థితి



అధిక వర్షాలతో ఎండు గడ్డి పాడైంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గడ్డి వాముల్లో అడుగు భాగంలోకి నీరు చేరడం, పైనుంచి వర్షం పడడంతో భద్రపరుచుకున్న గడ్డి కుళ్లిపోయింది. పశువులకు ఎండు గడ్డి దొరకడం గగనంగా మారింది. ఉత్తరాది నుంచి మోపు కొనడమే రూ.100 అవుతుంది. ఇక్కడికి బాడుగులు తడిసిమోపుడు అవుతున్నాయి.

– కలికి సుధాకర్‌రెడ్డి, పాడి రైతు, కోవూరుపల్లి, బోగోలు మండలం

గడ్డి దొరక్క పశువులు తగ్గించుకున్నా..



అసలే వరి సాగు చేయడం చాలా వరకు ఏటా తగ్గిపోతోంది. మెషిన్ కోతలు కావడంతో తీసుకెళ్లిన గడ్డిని నిల్వ చేయడం కూడా కష్టంగా ఉంది. చినుకు పడితే గడ్డి చిత్తడి అయిపోతోంది. అయితే వర్షాలు ఇలా ఎడతెరిపి లేకుండా కురవడం ఎవరూ ఊహించలేదు. ఉన్న గడ్డి వర్షాలకు పాడైపోయింది.

– కేతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పాడిరైతు, ముంగమూరు


డీఎంహెచ్‌ఓగా డాక్టర్ సుజాత బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వి.సుజాత

నెల్లూరు(అర్బన్): నూతన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణిగా డాక్టర్ సుజాత సోమవారం స్థానిక సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనంతపురం జిల్లా ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా 1997లో విధుల్లో చేరారు. 2012లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది అనంతపురం జిల్లా ఆత్మకూరు రూరల్ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా పదోన్నతి పొంది నెల్లూరు డీఎంహెచ్‌ఓగా నియమితులయ్యారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తొలి ప్రాధాన్యతనిస్తానన్నారు. డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే నర్సింగ్, పారామెడికల్ సిబ్బందిపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. పీహెచ్‌సీల్లో మందుల కొరత లేకుండా చూస్తామన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఫైళ్లు పెండింగ్ లేకుండా చూస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను పలువురు డాక్టర్లు, సిబ్బంది, హంస అసోసియేషన్ నాయకులు కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బదిలీ



డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద

కందుకూరు: కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రియంవదను పదోన్నతిపై ఇక్కడి నుంచి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె మంగళగిరి జీజీహెచ్ సీఎస్ఆర్ ఎంఓ గా నియమితులయ్యారు. 2019 నుంచి దాదాపు ఐదేళ్ల పాటు కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా కరోనా వంటి మహమ్మారిని ఎదుర్కోవడంలో విజయవంతంగా పనిచేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేయడంలో తన వంతు కృషి చేశారు.

క్లుప్తంగా

కృష్ణపట్నంలో ఇసుక అక్రమ రవాణా

• అడ్డుకున్న గ్రామస్తులు



ఇసుక లోడింగ్

సాక్షి టాస్క్‌ఫోర్స్: ముత్తుకూరు మండలంలో ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్ నుంచి బూడిద, చెరువుల నుంచి మట్టి దోచుకుపోయి సొమ్ము చేసుకుంటున్న అధికార పార్టీ నాయకులు ఇప్పుడు సముద్ర తీరంలోని ఇసుకపై దృష్టి సారించారు. యంత్రాలతో రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వారా పెద్దఎత్తున తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యంగా కృష్ణపట్నం తీరంలో 756 సర్వే నంబర్ భూముల్లో నేలటూరు సమీపాన ఇసుక అక్రమ రవాణాకు స్కెచ్ వేశారు. ఆదివారం రాత్రి యంత్రాలతో టిప్పర్లలో ఇసుకను నింపి బైపాస్‌రోడ్డు ద్వారా తోటపల్లిగూడూరు ప్రాంతాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు కొందరు అక్రమ రవాణాను అడ్డుకున్నారు. దీంతో తాత్కాలికంగా రవాణాను నిలిపివేశారు. అప్పటికే సుమారు 15 టిప్పర్లకు పైగా ఇసుక రవాణా చేసినట్టు సమాచారం.

నేనున్నా.. సొంత నిధులతో చేయిస్తా..

• రహదారిని బాగు చేయించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ



రోడ్డు పని చేయిస్తున్న వెంకటరమణయ్య

సైదాపురం: కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో చిన్నచిన్న పనులు జరగడం లేదు. వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై వినతిపత్రాలు ఇస్తే ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలోని అనంతమడుగు ఎంపీటీసీ సభ్యుడిగా వైఎస్సార్‌సీపీకి చెందిన లేబాక వెంకటరమణయ్య ఉన్నారు. దళితవాడ నుంచి అనంతమడుగు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. వర్షాలకు బురదమయంగా మారుతోంది. దీనిని బాగు చేయాలని ఆయన అధికారులను పలుమార్లు కోరినా స్పందించలేదు. దీంతో సొంత నిధులతో పనులు చేయించాలని పూనుకున్నారు. సోమవారం జేసీబీతోపాటు రెండు ట్రాక్టర్లను బాడుగకు తీసుకుని పనులను ప్రారంభించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు మట్టి తరలించి బురద లేకుండా రహదారిని బాగు చేయించారు. దీంతో కాలనీ వాసులంతా ఎంపీటీసీ చేసిన పనిని మెచ్చుకుంటున్నారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ఇంజినీర్లు సోమవారం తెలిపారు. ఒకటో యూనిట్లో 410, మూడో యూనిట్లో 510 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఓవరాయిలింగ్ కారణంగా రెండో యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశారు.

నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

• ఈ–చలాన్లు చెల్లించని వాహనాలు సీజ్

నెల్లూరు(క్రైమ్): ఈ–చలాన్‌లు చెల్లించకుండా తిరుగుతున్న వాహనదారులపై హైకోర్టు ఆదేశాలతో కొరడా ఝుళిపించేందుకు ట్రాఫిక్ పోలీసులు సిద్ధమయ్యారు. తక్షణమే చలాన్‌లు చెల్లించకపోతే వాహనాలను సీజ్ చేసే అవకాశం ఉంది. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనులకు పోలీసు అధికారులు ఈ–చలాన్‌లు విధిస్తుంటారు. వాహనదారులు వాటిని ఆన్‌లైన్ లేదా ఇతర మార్గాల్లో చెల్లిస్తుంటారు. కొందరు కట్టకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం చలాన్‌లు చెల్లించేలా చర్యలు చేపట్టాలని, అలా చేయకపోతే వాహనాలను సీజ్ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించింది. దీంతో నెల్లూరు ట్రాఫిక్ పోలీసులు మంగళవారం నుంచి నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.29
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 105
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 196
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 216
లేయర్ చికెన్	: 170

సమస్యలు వివరించి.. పరిష్కారం కోరి..

• కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
• 263 వినతుల అందజేత



వినతిపత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

నెల్లూరు రూరల్: నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 263 మంది సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కలెక్టర్‌తోపాటు జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు.

• అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 127 వినతులు అందాయి. మున్సిపల్ శాఖవి 21, సర్వేవి 12, పంచాయతీరాజ్ శాఖవి 16, సివిల్ సప్లయిస్‌వి ఏడు తదితర శాఖల వినతులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్, ఐసీడీఎస్ పీడీలు నాగరాజుకుమారి, గంగా భవానీ, వేణుగోపాల్, సుశీల, డీటీసీ చందర్, డీఈఓ బాలాజీరావు, జలవనరుల శాఖ ఎస్‌ఈ దేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలంటూ..

లింగసముద్రం మండలంలో రాళ్లపాడు ప్రాజెక్ట్ కుడి కాలువ గేటును పైకి లేపి రైతులకు సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య కోరారు. అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు.

ఎరువులు సక్రమంగా అందేలా చూడాలి

జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, దీనిపై దృష్టి పెట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మూలి వెంగయ్య డిమాండ్ చేశారు. అధికారులకు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. 25 వేల టన్నుల ఎరువులు అవసరం ఉందని, కానీ 16 వేల టన్నులు మాత్రమే దిగుమతి చేశారన్నారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

ఫిర్యాదుల వెల్లువ



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

• ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించిన ఎస్పీ
• వివిధ ప్రాంతాల నుంచి 90 మంది రాక

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 90 మంది విచ్చేసి పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులను సమర్పించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ స్పందించి చట్టపరిధిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని బాధితులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు రూరల్, ఎస్బీ, డీటీసీ డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, గిరిధర్‌రావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ – 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం చిత్రహింసలు

ఆస్తి కోసం కొడుకు కొండలరావు చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. అతడి నుంచి రక్షణ కల్పించాలని బిట్రగుంటకు చెందిన ఓ వృద్ధుడు ఫిర్యాదు చేయగా స్పందించిన ఎస్పీ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత పోలీస్ అధికారులను ఆదేశించారు.

ట్రేడింగ్ యాప్ పేరిట మోసం

ఓ ప్రముఖ కంపెనీకి చెందిన ట్రేడింగ్ యాప్ ద్వారా కోట్లలో డబ్బులు సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు నమ్మించి రూ.33 లక్షలు నగదు ఆన్‌లైన్‌లో వేయించుకుని మోసగించారని దర్గామిట్టకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

కుమార్తె ఆచూకీ కోసం..

నా కుమార్తె నగరంలోని ఓ హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తోంది. ఇటీవల హాస్పిటల్‌కు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరింది. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. విచారించి ఆమె ఆచూకీ తెలియజేయాలని దర్గామిట్ట పరిధికి చెందిన ఓ మహిళ విజ్ఞప్తి చేశారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు

తన ఐదేళ్ల కుమార్తెతో పక్కింట్లో ఉంటున్న లారెన్స్ అలియాస్ చింటూ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బంది పెడుతున్నాడు. పలుమార్లు హెచ్చరించినా మార్పు రాలేదు. అతడిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు బాలాజీ నగర్‌కు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

ఆటోతో ఢీకొట్టి..

పాతకక్షలను మనసులో పెట్టుకుని రామయ్య మరికొంతమంది కలిసి ఆటోతో ఢీకొట్టి చంపబోయారని వారిపై చర్యలు తీసుకోవాలని రాపూరుకు చెందిన ఓ మహిళ వినతిపత్రం ఇచ్చారు.

ఇద్దరు పాతనేరస్తుల అరెస్ట్

• రూ.21.05 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
• రివార్డులు అందజేసిన ఏఎస్పీ సౌజన్య



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ సౌజన్య, చిత్రంలో డీఎస్పీ తదితరులు

నెల్లూరు(క్రైమ్): ఇంటి దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఇద్దరు పాతనేరస్తులను నెల్లూరు సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.21.05 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డితో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. నగరంలోని పొర్లుకట్టలో విజయలక్ష్మి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఈనెల 15వ తేదీన వ్యక్తిగత పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు తలుపులు పగులగొట్టి బీరువాలోని బంగారు, వెండి వస్తువులు, నగదు దోచుకెళ్లారు. రాత్రి ఏడుగంటల ప్రాంతంలో ఇంటికొచ్చిన విజయలక్ష్మి చోరీ జరిగినట్లు గుర్తించి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ లభ్యమైన ఆధారాలు, సాంకేతికత సాయంతో నిందితులను పాతనేరస్తులైన వెంకటేశ్వరపురం జనార్దనరెడ్డి కాలనీకి చెందిన ఎ.సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు, వెంకటేశ్వరపురానికి చెందిన ఆర్.శ్రీనివాసులు అలియాస్ శీనుగా గుర్తించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలించారు. సోమవారం వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పొర్లుకట్టతోపాటు నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటి దొంగతనాలకు పాల్పడినట్లు బయటపడింది. దీంతో నిందితులను అరెస్ట్ చేశారు. పొర్లుకట్టలో అపహరించిన 49 సవర్ల బంగారు ఆభరణాలు, 149 గ్రాముల వెండి వస్తువులు, రూ.లక్ష నగదు, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ చేసిన 190 గ్రాముల వెండి వస్తువులు మొత్తం రూ.21,05,010 సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. నవాబుపేట, వేదాయపాళెం, నెల్లూరు రూరల్, కోవూరు, కొడవలూరు పోలీసుస్టేషన్లలో చోరీకేసులు, రంపచోడవరంలో గంజాయి కేసున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఏఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది విజయమోహన్, సుబ్బారావు, వెంకటేశ్వర్లును ఏఎస్పీ అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

నిర్లక్ష్యం వద్దు.. హెల్మెట్ ధరించండి

• ఏఎస్పీ సౌజన్య పిలుపు



ర్యాలీలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): 'ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంగా ఉండొద్దు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ప్రమాద సమయంలో అదే రక్షణ కవచంలా పనిచేస్తుంది' అని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అన్నారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సోమవారం పోలీస్ అధికారులు, సిబ్బంది హెల్మెట్ ధారణపై నెల్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది. దీనిని ప్రారంభించిన ఏఎస్పీ మాట్లాడుతూ అనేకమంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్లలో ప్రయాణించేవారు సీటుబెల్టులను విధిగా ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. రహదారి భద్రతా నియమాలను పాటించి క్షేమంగా గమ్యస్థానాలను చేరాలని సూచించారు. జిల్లాలో హెల్మెట్ ధరించని వాహనదారులపై ఎంవీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ర్యాలీలో ఎస్బీ, నెల్లూరు రూరల్, ఏఆర్ డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, ఘట్టమనేని శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఏఓ చంద్రమౌళి, నగర ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల ఆశలు గల్లంతు

• ప్రత్యేకాధికారి పాలనలోనే డీసీసీబీ, డీసీఎంఎస్



నెల్లూరులోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ), జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్మెస్)ల పదవులపై ఆశలు పెట్టుకున్న కూటమి నేతలకు షాక్ తగిలింది. చైర్మన్లుగా, పాలకమండలి సభ్యులుగా పదవులు పొందుతామని కొందరు నేతలు ఆశపడ్డారు. అయితే మరో ఆరునెలలపాటు ప్రత్యేకాధికారి పాలనను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎన్నికైన వారు డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు చైర్మన్, డైరెక్టర్లుగా నియమితులవుతుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని నేతలు భావించారు. అయితే అలా జరగకపోవడంతో పదవులపై ఆశలు పెట్టుకున్న వారు నిరాశలో ఉన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జేసీ కార్తీక్ మరో ఆరునెలలపాటు ప్రత్యేకాధికారిగా కొనసాగుతారు.

అధికారం మాది.. ఏమైనా చేస్తాం

• కోర్టు పరిధిలో ఉన్న భూములు
• ఆగని టీడీపీ నేతల ఆక్రమణ పర్వం
• 50 ఎకరాల్లో పొగాకు సాగుకు సిద్ధం



వ్యవసాయ పనులు చేస్తున్న దృశ్యం

మర్రిపాడు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఏకంగా కోర్టు పరిధిలో ఉన్న భూములను ఆక్రమించి పొగాకు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. భూ ఆక్రమణలపై అధికారులు ఎన్నిమార్లు హెచ్చరించినా పట్టించుకోవడం లేదు.

మండల పరిధిలోని చిన్నమాచనూరు పంచాయతీ నెర్దనంపాడు రెవెన్యూ గ్రామంలో ఫ్రీ గోల్డ్ కంపెనీకి సుమారు 102 ఎకరాల భూములున్నాయి. ఇవి కోర్టు పరిధిలో ఉన్నాయి. అయితే టీడీపీ నాయకులు అంబటి కాటిరెడ్డి, అంబటి శ్రీనివాసులు, ఇండ్యాల వెంకటరాములు, నెల్లూరు శ్రీనివాసులు గ్రామ సర్వే నంబర్ 143/1లో నాలుగు ఎకరాలు, 143/2లో ఐదు ఎకరాలు, 141 – 1 – 1లో ఐదు ఎకరాలు, 131 – 1లో ఐదు ఎకరాలు.. ఇలా మొత్తంగా సుమారు 50 ఎకరాల భూమిని చదును చూసి పొగాకు నాటేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై గతంలో ఉన్న తహసీల్దార్ రెండుమార్లు వారిని హెచ్చరించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఆ భూమిలో వ్యవసాయ పనులు సాగిస్తున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్ సైతం కోర్టు పరిధిలో ఉన్న భూముల్లో దిగొద్దంటూ వారిని హెచ్చరించినా పట్టించుకోలేదు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో భూ ఆక్రమణలు యథేచ్ఛగా జరిగాయి.

చర్యలు తీసుకుంటాం

"నెర్దనంపాడులో భూ ఆక్రమణల విషయం మా దృష్టికి వచ్చింది. ఫ్రీ గోల్డ్ సంస్థకు చెందిన కొన్ని భూములు కోర్టు పరిధిలో ఉన్నాయి. వాటిలో ఎవరూ వ్యవసాయ పనులు చేసేందుకు వీలు లేదు. మరికొన్ని భూములు కూడా ఉండటంతో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్ యాదవ్, ఇన్‌చార్జి తహసీల్దార్, మర్రిపాడు

జల్సాలకు అలవాటుపడి చోరీల బాట



మాట్లాడుతున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు, చిత్రంలో పోలీస్ సిబ్బంది

• ముగ్గురు దొంగల అరెస్ట్

నెల్లూరు సిటీ: ముగ్గురు స్నేహితులు చెడు వ్యసనాలకు బానిసయ్యారు. సీసీ కెమెరాల్లేని ప్రాంతంలో రెక్కీ చేశారు. ఓ దుకాణంలో చోరీ చేసి జైలుపాలయ్యారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు వివరాలు వెల్లడించారు. కల్లూరుపల్లి గ్రామానికి చెందిన షేక్ సుభాని, కె.నవీన్, కొండాయపాళెంగేటు ప్రాంతానికి చెందిన పి.బాలాజీ స్నేహితులు. రోజూ మద్యం తాగుతూ సులువైన పద్ధతిలో డబ్బులు ఎలా సంపాదించాలో చర్చించుకునేవారు. ఈ క్రమంలో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. సీసీ కెమెరాల్లేని ప్రాంతాల్లో చోరీ చేస్తే ఎవరూ పట్టుకోలేరని భావించి వివిధ ప్రాంతాల్లో రెక్కీ వేశారు. రూరల్ మండలంలోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు సమీపంలోని ఎంవీఆర్ ట్రేడర్స్ షాపును ఎంచుకున్నారు. సెప్టెంబర్ 19వ తేదీ రాత్రి దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టి రూ.1.42 లక్షలు విలువైన విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ముగ్గురు దొంగలను సోమవారం అరెస్ట్ చేసి రూ.1.42 లక్షల విలువైన విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ వేణు, ఎస్సై లక్ష్మణరావు, ఏఎస్సై సురేంద్రబాబు, హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ, కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, మోహన్‌కృష్ణను రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అభినందించారు.